క్లుప్తంగా

అధిక ఫీజులు వసూలు చేస్తే సహించం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రైవేట్ పాఠశాలలో, కళాశాలలో యాజమాన్యాలు విద్యార్థుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తే సహించేది లేదని, ప్రత్యక్ష దాడులు చేస్తామని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రేమ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. చదువుల పేరుమీద పుస్తకాలు, టై, బెల్ట్‌లు, యూనిఫాం అమ్మకాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. తక్షణమే విద్యాసంస్థలలో పెంచిన ఫీజులను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయకుండా ఫీజులు పెంచుకుంటూ కాలం గడుపుతున్నారని ఆరోపించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

లింగాల: మండలంలోని అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ తరగతులు గురువారం రెండవ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు టీచర్లకు బోధనకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కల్పించారు. కేంద్రాలు పిల్లలను ఆకర్శించే విధంగా తీర్చిదిద్దాలని, ఆట పాటలతో చిన్నారులకు ఏ విధంగా బోధన చేయాలనే దానిపై టీచర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

పాఠశాలల తనిఖీ

తాడూరు: మండలంలోని ఆకునెల్లికుదురు, మేడిపూర్, పాల్మూరు, గుట్టలపల్లి ప్రాథమిక పాఠశాలలను గురువారం ఎంఈఓ భాస్కర్ రెడ్డి సందర్శించారు. బడిబాటలో భాగంగా విద్యార్థుల సంఖ్య పెంచాలని చదవడం, రాయడం చతుర్విద ప్రక్రియలలో మెళకువలు నేర్పించాలని సూచించారు. యూనిఫాం, పాఠ్యపుస్తకాలు ప్రతి విద్యార్థికి అందేలా చూడాలన్నారు. భోజన నిర్వహణ శుభ్రంగా ఉండాలని తెలిపారు.

బడి బయట పిల్లల గుర్తింపు

కోడేరు: మండలంలోని బడిబాట కార్యక్రమం భాగంగా బుధవారంతో ముగియడంతో మండలంలో మొత్తం 27 మంది పిల్లలను గుర్తించి పాఠశాలలకు పంపించినట్లు ఎంఈఓ కార్యాలయ సిబ్బంది నాగేష్ గురువారం ప్రకటనలో తెలిపారు.

వెబ్ కౌన్సెలింగ్‌తో నష్టం

ఊర్కొండ: ఉపాధ్యాయ ప్రమోషన్లలో వెబ్ కౌన్సెలింగ్ ద్వారా గందరగోళం ఏర్పడిందని ఎస్జీటీ ఎమ్మెల్సీ ఓటు హక్కు సాధన సమితి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చంద్రశేఖర, మల్లికార్జున్ గురువారం ప్రకటనలో కోరారు. వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించటం వల్ల ఖాళీలు ఏర్పడుతున్నాయని, ఫలితంగా జూనియర్ టీచర్లకు ముందు స్థానాలు వస్తాయని తెలిపారు. చిన్న జిల్లాలు, తక్కువ పోస్టులు ఉండటం వల్ల మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించి ఎస్జీటీలకు న్యాయం చేయాలని కోరారు.

సిమెంట్ బెంచీల వితరణ

తెలకపల్లి: మండలంలోని గట్టురావిపాకుల చెందిన ఎంపీటీసీ సభ్యుడు యాతం బాలయ్య పది సిమెంట్ బెంచీలను గ్రామంలో ఏర్పాటు చేసేందుకు వితరణ చేశారు. ఎల్లమ్మగుడి, బస్టాండ్ సర్కిల్ ప్రధాన రోడ్‌లో వీటిని ఏర్పాటు చేశారు.

మద్దతు ధరపై హర్షం

ఊర్కొండ: కేంద్ర ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించడంపై కిసాన్ మోర్చ ఆధ్వర్యంలో గురువారం ప్రధాని మోదీ చిత్రపటానికి మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్యాంసుందర్రెడ్డి, ఆనంద్‌గౌడ్, మహేందర్, నారాయణ రెడ్డి, తిరుపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయ భూముల కౌలుకు టెండర్లు

ఊర్కొండ: మండలంలోని జాకినాలపల్లి ఆంజనేయస్వామి దేవస్థాన భూములు రెండేళ్లకు కౌలు టెండర్లు గురువారం దేవాలయ కార్యనిర్వహణ అధికారి సత్య చంద్రారెడ్డి, పర్యవేక్షణ అధికారి తిరుపతయ్య ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 5.20 ఎకరాల భూమిని గుండ్లపల్లి వెంకటయ్య రూ.32వేలకు దక్కించుకున్నారు. 21.36 ఎకరాల భూమిని కొమ్మగోని రాములుగౌడ్ రూ.1.57లక్షలకు దక్కించుకున్నారు. కార్యక్రమంలో శ్రీశైలం, మహేష్, గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

అధ్యాపకుడికి ఉత్తమ అవార్డు

వంగూరు: మండలంలోని కోనేటిపూర్ చెందిన అంజయ్య ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాలలో గణితశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న అంజయ్యకు ఆల్ఫా ఇంటర్నేషనల్ పబ్లికేషన్ వారు గణితశాస్త్రంలో విశిష్ట సేవలు అందించిన అవార్డును అందజేశారు. కోనేటిపూర్ గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.

విద్యాభివృద్ధికి కృషి

వంగూరు: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించి విద్యాభివృద్ధికి కృషిచేస్తామని జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణం పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో రమేష్‌గౌడ్, పండిత్ రావు పాల్గొన్నారు.

ఆరోగ్యం అందరి బాధ్యత



వెల్దండలో మాత్రలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఉప్పునుంతల: విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేసి బాధ్యతతో నులి పురుగులను పూర్తిగా నిర్మూలిద్దామని ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ లక్ష్మణ్ సూచించారు. గురువారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహించిన విద్యార్థులకు మాత్రలు వేసే కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. మొత్తం 3,176 మందికి మాత్రలు వేయడం జరిగిందని వైద్యాధికారి బిక్కులాల్ తెలిపారు. మిగిలిపోయిన విద్యార్థులకు ఈనెల 27న మాత్రలు వేస్తామిన పేర్కొన్నారు.

ఊర్కొండ: మండల వ్యాప్తంగా అన్ని గ్రామల్లో 1,386 మంది బాలురు, 1,490 మంది బాలికలకు ఆల్బెండజోల్ మాత్రలు వేశామని వైద్య సిబ్బంది తెలిపారు.

పెంట్లవెల్లి: స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఎంపీటీసీ సుమలత, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ సంపూర్ణమ్మ, హెచ్‌ఎం సీవీ రావు, అర్జున్‌గౌడ్, నర్సింహ, శ్రీధర్ పాల్గొన్నారు.

బల్మూర్: మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం అధికారి లక్ష్మణ్ మాట్లాడారు. విద్యార్థులు శుభ్రత పాటించక పోవడం, కలుషిత ఆహారం తీసుకోవడం వలన శరీరంలో నులి పురుగులు, కొంకిపురుగులు, ఎలిక పాములు తయరవుతాయని తెలిపారు. దీంతో ఏకాగ్రత కోల్పోవడం, చదువుపై అశ్రద్ధ, మానసిక పెరుగుదల లోపించి చురుకుదనం మందగిస్తుందని తెలిపారు. వీటి నివారణకు తప్పనిసరి ఆల్బెండజోల్ మాత్రలను వేయాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు భూపాల్, ప్రశాంత్, సుష్మ, ప్రశాంతి, మధుమోహన్, నిరంజన్ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: నులిపురుగుల నివారణ కోసం చేపట్టిన మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మేకల గౌరమ్మ అన్నారు. మారేడుమాందిన్నె ప్రాథమిక పాఠశాలలో గురువారం నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు.

వెల్దండ: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. డాక్టర్ స్వరూప మాట్లాడుతూ కార్యక్రమంలో ఎంఈఓ శంకర్‌నాయక్, హెచ్‌ఎం జైపాల్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు మురళీ, మనోజ్, లక్ష్మణ్, జహంగీర్‌బీ ఉన్నారు.

దోమలపెంట: దోమలపెంట, ఈగలపెంటలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో 550 మంది విద్యార్థులకు గురువారం ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. డా.అభిలాష్, జ్యోతి, శశికళ పాల్గొన్నారు.

లింగాల: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులకు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది మాత్రలను పంపిణీ చేశారు.

కోడేరు: పిల్లలు తప్పనిసరిగా నులి పురుగుల మందులను వేయించుకోవాలని డాక్టర్ దశరథం అన్నారు. గురువారం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాల విద్యార్థులకు మందులను పంపిణీ చేశారు. మండలంలో మొత్తం 9513 మందికి మందులను వేయడం జరిగిందన్నారు.


ఉప్పునుంతలలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్


పెంట్లవెల్లిలో విద్యార్థులకు మాత్రలు అందిస్తున్న వైద్య సిబ్బంది

విత్తనాలు, ఎరువుల నమూనాలు సేకరణ


నమూనాలను సేకరిస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

లింగాల: మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ షాపుల నుంచి వ్యవసాయ శాఖ అధికారులు గురువారం విత్తనాలు, ఎరువుల నమూనాలను సేకరించారు. ఏఓ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వానాకాలంలో సాగు చేసే విత్తనాలు, సాగుకు ఉపయోగించే ఎరువుల నాణ్యత ప్రమాణాలను పరీక్షించేందుకు నమూనాలను సేకరించినట్లు తెలిపారు. సేకరించిన వాటిని పరీక్షల నిమిత్తం ఎరువుల పరీక్ష కేంద్రం మలక్‌పేట్‌కు పంపిస్తున్నట్లు చెప్పారు. విత్తనాలలో మొలక శాతం, ఎరువులలో పోషకాల లభ్యత, నాణ్యత ప్రమాణాలు తెలుస్తాయని అన్నారు. ఫలితాల ఆధారంగా ఎలాంటి విత్తనాలు, ఎరువులను విక్రయిస్తున్నారనే విషయాలు వెల్లడవుతాయని, పరీక్షలకు అనుగుణంగా విత్తనాలు, ఎరువుల విక్రయాలు కాకపోతే డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు.

మెరుగైన విద్యను అందించాలి


పెద్దకొత్తపల్లి: కేజీబీవీ బాలికల పాఠశాలలో మెరుగైన విద్యను అందించాలని ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీని గురువారం తనిఖీ చేశారు. పాఠశాలలోని మౌలిక వసతులను గురించి ప్రత్యేకాధికారి లతను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యుత్ సమస్య, విద్యార్థులకు అదనపు గదుల సమస్య ఉందని ఆమె ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు. సొంత ఖర్చుతో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కొత్తగా నిర్మిస్తున్న గదులను త్వరితగతిన పూర్తి చేయిస్తామన్నారు.

అర్హులందరికీ ‘గృహజ్యోతి’


ఆన్‌లైన్ విధానం పరిశీలిస్తున్న ఏఈ అంజనేయులు

అచ్చంపేట రూరల్: ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకం కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వర్తింపజేస్తామని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ అంజనేయులు అన్నారు. గురువారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తుల ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. కావాల్సిన పత్రాలను అందించాలని, త్వరితగతిన ప్రభుత్వ ఆదేశాల మేరకు పథకం వర్తిస్తుందన్నారు. పట్టణ వాసులు మున్సిపాలిటీలో, గ్రామీణ వినియోగదారులు ఎంపీడీఓ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

జడ్జిని కలిసిన కలెక్టర్



నాగర్‌కర్నూల్ క్రైం: ఇటీవలే కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన బదావత్ సంతోష్ గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో జడ్జి రాజేష్‌బాబును మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకేను అందజేశారు. అనంతరం జడ్జి చాంబర్‌లో పలు అంశాలపై చర్చించారు.

యోగా ప్రాధాన్యతపై విద్యార్థులకు అవగాహన


నడింపల్లిలో యోగాసనాలు చేస్తున్న విద్యార్థులు

అచ్చంపేట రూరల్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. యోగాలో ఉన్న వివిధ పద్ధతులను పాటించడం వలన శారీరకంగా, మానసికంగా, ఆరోగ్యంగా ఉంటారని, యోగని నిత్యజీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సామ్యనాయక్, శంకరయ్య, శంకర్, శ్రీశైలం, జయమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు సన్మానం



నాగర్‌కర్నూల్ క్రైం: కలెక్టర్ సంతోష్‌ను తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో సంఘం ఎల్లవేళలా ముందుండి పనిచేస్తామని కలెక్టర్‌కు తెలిపారు. కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌రావ్, బగవేణి నరసింహులు, సంజీవ, ఖాజా, రాజుగౌడ్ పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: కలెక్టర్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన సంతోష్‌ను గురువారం నాగర్‌కర్నూల్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో శాల్వాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌కుమార్, రాజేష్, శ్రీనివాసులు, ప్రవీన్, వెంకటేష్, తిరుతయ్యయాదవ్ తదితరులు ఉన్నారు.

రాచూర్‌కు బస్సు నడిపించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

వెల్దండ: మండలంలోని రాచూర్-కుప్పగండ్లకు బస్సు సౌకర్యం కల్పించాలని గురువారం రాచూర్ చెందిన యువకులు కల్వకుర్తి డిపో మేనేజర్ సుభాషిణికి వినతిపత్రం అందజేశారు. బస్సులు లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. గతంలో కల్వకుర్తి నుంచి రాచూర్, యంగంపల్లి, కుప్పగండ్ల బస్సును ఉదయం, సాయంత్రం వేళ్లలో నడిపించే వారని తెలిపారు. మళ్లీ పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కావడంతో బస్సును నడిపించాలని కోరారు.

ఆస్పత్రిలో సదుపాయాలు కల్పించాలి


వినతిపత్రం సమర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ రూరల్: జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం మండల కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని ఏఓ హనుమంతుకు వినతిపత్రం సమర్పించారు. గతంలో ఏరియా ఆస్పత్రిగా ఉన్నప్పుడు ఎంత మంది శానిటేషన్ సిబ్బంది ఉన్నారో జనరల్ ఆస్పత్రిగా మారిన తర్వాత అదే సిబ్బందితో శానిటేషన్ చేయిస్తున్నారని అన్నారు. తాగునీరు, మరుగుదొడ్లు, రోగులు కూర్చోవడానికి కనీసం నీడ కూడా లేకుండాపోయిందని విమర్శించారు. ఆదివారం కూడా జనరల్ ఓపీ చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణ, నవీన్, శివరాం, రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

తెలకపల్లి: విద్యుత్ స్తంభం విరిగిపడిన ఘటనలో ప్రమాదం తప్పింది. మండల కేంద్రంలోని బీసీ కాలనీలోని సిద్దార్థ మాడల్ స్కూల్ సమీపంలో ప్రధాన రోడ్డు గురువారం సాయంత్రం పంచాయతీ ఆధ్వర్యంలో పొక్లెయిన్ సాయంతో పిచ్చి మొక్కలు, కంపచెట్లను తొలగిస్తున్నారు. ఈక్రమంలో అక్కడే విద్యుత్ స్తంభానికి ఉన్న తీగ కంపచెట్ల వెంటనే రావడంతో స్తంభం ఒక్కసారిగా విరిగిపడింది. విద్యుత్ తీగలు తెగిపోయాయి. నిరంతరం రద్దీగా ఉండే ఆ ప్రాంతంలో రెండు పాఠశాలల విద్యార్థులు తిరుగుతుంటారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని కాలనీవాసులు తెలిపారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ స్తంభం విరిగిపోయిందని కాలనీవాసులు ఆరోపించారు.


విరిగిపడిన విద్యుత్ స్తంభం

ఆదివాసి మహిళను వేధించిన వారిని అరెస్టు చేయాలి


పెంట్లవెల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు


మొలచింతలపల్లిలో మాట్లాడుతున్న చెంచు మహిళా సంఘం సభ్యులు

అచ్చంపేట రూరల్: కొల్లాపూర్ నియోజకవర్గంలోని ఆదివాసి మహిళను వేధించి చిత్రహింసలకు గురి చేసిన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో గిరిజన సంఘం ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. గిరిజన మహిళ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరాం, బాషా, వెంకటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

పెంట్లవెల్లి: ఆదివాసి మహిళలను చిత్రహింసలకు గురి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు తహసీల్దార్ హిమబిందుకు గురువారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజు, తిమ్మస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: కొల్లాపూర్ మండలంలోని మొలచింతలపల్లి చెంచు భ్రమరాంబ కాలనీలో నివాసం ఉంటున్న ఈశ్వరమ్మపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసి శిక్షించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు గీత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక జిల్లా జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను సీపీఎం పార్టీ సభ్యులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ మారుమూల చెంచు పెంటల్లో నివాసం ఉంటున్న మహిళపై కొందరు దుర్మార్గంగా శారీరకంగా హింసించారని అన్నారు. బీసీ కులానికి చెందిన బండి వెంకటేష్, శివ ఈ అఘాయిత్యానికి ఒడిగట్టారని మహిళను భయపెట్టి సభ్యసమాజం తలదించుకునే విధంగా ఈ ఘటనకు పాల్పడ్డారని తెలిపారు. సమాజంలో మహిళలు ధైర్యంగా బతకలేని పరిస్థితి నేటికి ఉన్నదని ఇప్పటికైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల రక్షణ కోసం తీసుకువచ్చే చట్టాలు కఠినంగా ఉండాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రామయ్య, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొల్లాపూర్ రూరల్: చెంచు మహిళపై దాడి చేసిన వారిపై వెంటనే అరెస్ట్ చేయాలని మొలచింతలపల్లి చెంచు మహిళా సంఘం సభ్యులు, చెంచు నాయకులు, ప్రజలు డిమాండ్ చేశారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. వారం రోజుల క్రితం మహిళపై వారు దాడి చేశారన్నారు. గ్రామంలో మాపై నిరంతరం దాడులు చేస్తున్నారన్నారు. మా భూములు కూడా లాక్కుంటున్నారని వాపోయారు. ఆమెపై జరిగిన దాడి సభ్య సమాజం తలదించుకునేలగా ఉందన్నారు. వారిని వెంటనే అరెస్టు చేసి, ఎస్సీ, ఎస్టీ చట్టం కింద శిక్షించాలన్నారు.

లీకేజీలను అరికట్టి పరీక్ష నిర్వహించాలి


జిల్లా కేంద్రంలో నిరసన తెలుపుతున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై తక్షణమే ప్రధాని మోదీ స్పందించి నిందితులపైన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం అంబేద్కర్ చౌరస్తాలో నిరసన చేపట్టారు. నీట్ పరీక్షను వెంటనే రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్‌తో మోదీ చెలగాటం ఆడటం సరికాదన్నారు. దేశ భవిష్యత్ తీర్చిదిద్దే విద్యార్థుల పరీక్షలతో ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం దురదృష్టకరం అన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక ఉత్తరాది రాష్ట్రాలలో పేపర్లు లీకేజి అవుతున్నాయని అన్నారు. కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా పరీక్షల కన్న ముందే పేపర్ లీకేజీ చేయడం సరైంది కాదని విమర్శించారు. మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని గాలికి వదిలేసి విదేశీ పర్యటనల పేరుతో కాలం వెల్లదీస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కందికొండ గీత, పొదిలరామయ్య, సత్యనారాయణ, మహేష్, శివశంకర్, మహేష్, కృష్ణయ్య, వెంకటయ్య, బాలస్వామి తదితరులు పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశం

పట్టణంలో నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బీఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో గురువారం రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. పలు సంఘాల నాయకులు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన నీట్ పరీక్షను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల కోసం బడుగుబలహీన వర్గాలకు చెందిన 24 లక్షల మంది విద్యార్థులు భవిష్యత్ నాశనం అవుతున్నదని, ఈ విషయంలో తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. బీజేపీ పాలిత బీహర్, గుజరాత్, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాలలో పేపర్ లీకేజీ చేశారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ సంతోష్, ప్రేమ్‌కుమార్, జయశంకర్, రాములు, నిజాం, అరవిందాచారి, పృథ్వీరాజు, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలి

అచ్చంపేట రూరల్: నీట్ పరీక్ష పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్న సీపీఎం రాజకీయ శిక్షణా తరగతులకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాధ్యులను కఠినంగా శిక్షించాలని, ప్రధాని నరేంద్ర మోదీ బాధ్యత వహించి దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణ రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేశ్యానాయక్, మల్లేష్, శంకర్‌నాయక్, నాగరాజు, సైదులు, లాలమ్మ, రాజు, శివకుమార్, కృష్ణయ్య, శివలీల, రజిత, సైదమ్మ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణ మహోత్సవం



కోడేరు: మండలంలోని రాజాపూర్ శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి 7వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం కల్యాణం, ఆభరణల అలంకరణ నిర్వహించారు. స్వామి వారికి అలంకరణ చేసి, పట్టు వస్త్రాలు సమర్పించి కల్యాణ మహోత్సవాన్ని కనులపండవగా నిర్వహించారు. అనంతరం అన్నదానం చేపట్టి తీర్థ ప్రసాదలు ఇచ్చారు.

వాహనాల వేలం



అచ్చంపేట రూరల్: స్థానిక ఎక్సైజ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఎక్సైజ్ సూపరింటెండెంట్ గాయత్రి ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 10 వాహనాలు వేలం వేయగా, రూ.6,26,580 ఆదాయం వచ్చింది. ఈ నగదును ప్రభుత్వ ఖజానాలో జమ చేశామని ఎక్సైజ్ సీఐ కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యం: కేసు నమోదు

బల్మూర్: మండలంలోని తెల్జిరిగూడిసెలు చెందిన యువతి బుధవారం రాత్రి నుంచి అదృశ్యమైంది. ఏఎస్‌ఐ రేణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మిత్ర రాత్రి ఇంట్లోనే నిద్రించగా ఉదయం చూసే సరికి కనిపించలేదు. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.